

ప్రజావాణి రద్దయినా అర్జీదారుల రాక

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించినా అయినా సోమవారం అర్జీదారులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అధికారులు లేకపోవడంతో ఇన్‌వార్డు సెక్షన్‌లో అర్జీలను అందజేసి వెనుదిరిగారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యేవరకు ప్రజావాణి రద్దు చేస్తున్నామని, ప్రజలు దూరప్రాంతాల నుంచి వచ్చి ఇబ్బంది పడొద్దని కలెక్టర్ క్రాంతి సూచించారు.

డంపుయార్డు వద్దంటూ మహిళల ధర్నా

- ఏడో రోజు గుమ్మడిదలలో నిరసనల హోరు

గుమ్మడిదల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటు చేయవద్దంటూ గుమ్మడిదల మండల కేంద్రంలో ఏడో రోజు సోమవారం ఆందోళనలు కొనసాగాయి. డంపుయార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా మహిళలు ఆందోళన చేశారు. మండల రైతు జేఏసీ కన్వీనర్ చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 'డంపుయార్డు మాకొద్దు.. పచ్చని పర్యావరణమే ముద్దు..' అంటూ నినాదాలు చేశారు. మహిళలకు మద్దతుగా రైతు జేఏసీ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. వారం రోజులుగా డంపుయార్డు నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమం చేస్తుంటే ప్రజాప్రతినిధులు అధికారులు కనీసం స్పందించడం లేదని మహిళలు, రైతులు, జేఏసీ నాయకులు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి వెంటనే ప్యారానగర్‌లో ఏర్పాటు చేయబోయే డంపుయార్డును ఆపాలని డిమాండ్ చేశారు. రాజకీయాలు పక్కనపెట్టి పార్టీలకు అతీతంగా నాయకులంతా ఒకటై పోరాడాలని కోరారు. మరోవైపు ప్రజల నిరసనల నేపథ్యంలో పోలీసుల భద్రత మధ్య జీహెచ్‌ఎంసీ అధికారులు డంపుయార్డు పనులు వేగంగా చేస్తున్నారు.



గుమ్మడిదల మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న మహిళలు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి

నామినేషన్ కార్యక్రమంలో నిర్మలాజగ్గారెడ్డి

టీపీసీసీ చీఫ్, మంత్రులతో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్



పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి కరీంనగర్‌లో నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. నామినేషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన భారీ ర్యాలీలో వందలాది మంది కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు సీతక్క, కొండా సురేఖతో పాటు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త విజయం కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.



మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో నిర్మలా జగ్గారెడ్డి

ప్రత్యేకమా..

పొడగింపా?

- మూడు రోజుల్లో ముగియనున్న సహకార సంఘాల పాలకవర్గాల గడువు
- స్పెషలాఫీసర్ల నియామకానికి అధికారుల కసరత్తు
- పదవీకాలం పొడగించాలని కోరుతున్న చైర్మన్లు
- ఆరు నెలల వరకు ఎన్నికలు అనుమానమే



మెదక్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు క్షేత్రస్థాయిలో అండగా నిలుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం మరో మూడు రోజుల్లో ముగియనుంది. ఇప్పటికే పంచాయతీ మండల, జిల్లా పరిషత్‌లు, మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. తాజాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సైతం ఈ జాబితాలో చేరనున్నాయి. కొత్త పాలకవర్గాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్పెషలాఫీసర్లను నియమిస్తారా.. లేక పాత పాలకవర్గానికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారా అనే విషయంపై చర్చ సాగుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి ప్రస్తుతం సంగారెడ్డిలో డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(డీసీసీబీ) కొనసాగుతోంది. ఇటీవల ప్రభుత్వం కొత్తగా సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు స్వీకరించింది. కొత్త సంఘాలతో పాటు కొత్త డీసీసీబీలు ఏర్పాటు చేస్తారా.. లేదా ఉమ్మడి జిల్లాకు ఇప్పుడున్న దానినే కొనసాగిస్తారా అనేది తేలాల్సి ఉంది.

జిల్లా	సహకార సంఘాలు	సభ్యులు
మెదక్	57	76,765
సంగారెడ్డి	53	71,556
సిద్దిపేట	21	67,200

మార్గదర్శకాలు అందాల్సి ఉంది

సహకార సంఘాల ఎన్నికలపై మార్గదర్శకాలు అందాల్సి ఉంది. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 14తో ముగియనుంది. ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారులను నియమిస్తారా.. లేక పాతవారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారా అనేదానిపై స్పష్టత లేదు. కొత్త సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

-కరుణాకర్,
మెదక్ జిల్లా ఇన్‌చార్జి సహకార అధికారి

14న ముగియనున్న పదవీకాలం

పీఏసీఎస్‌ల పాలకవర్గాలను ఎన్నుకునేందుకు 2020 ఫిబ్రవరి 14న ఎన్నికలు నిర్వహించారు. అదే నెల 25న డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్లు, చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. వారి పదవీకాలం ఈ నెల 14తో పూర్తవుతుంది. సాధారణంగా సొసైటీల కాలపరిమితి ముగియడానికి ఆరు నెలల ముందుగానే ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి గడువు వరకు ముగిసే లోపు పూర్తిచేసేది. కానీ, ప్రస్తుతం వీటి నిర్వహణపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కూడా కనిపించడం లేదు. దీంతో, ప్రత్యేకాధికారుల పాలన అనివార్యంగా మారింది. మరోవైపు పలువురు అధికార పార్టీ డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు తమ పదవీకాలాన్ని పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పాలకవర్గాల

మిగతా 7వ పేజీలో..



ఐలాపూర్‌లోని వివాదాస్పదమైన భూములు

'ఐలాపూర్' పంచాయితీ

హైడ్రా తేల్చేనా!

- వివాదాల సుడిగుండంలో నిజాం సర్ఫేఖాస్ గ్రామం
- దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో నలుగుతున్న వివాదం
- న్యాయం కోసం గ్రామస్థులు, ప్లాట్ల యజమానుల ఎదురుచూపులు
- శాశ్వత పరిష్కారంపై దృష్టిసారించిన హైడ్రా

పటాన్‌చెరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి వివాదాల్లో మునిగిపోయిన అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామ భూసమస్యకు హైడ్రా ముగింపు పలికేనా అన్న చర్చ ప్రారంభమైంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల ఐలాపూర్ సందర్శించి రాజగోపాల్‌నగర్ ప్లాట్ల బాధితులతో సమావేశం కావడంతో దశాబ్దాల ఈ వివాదంపైకి అందరి దృష్టి మళ్లింది. అప్పటి నుంచి ఇప్పటి దాకా న్యాయం కోసం గ్రామస్థులు, ఆ గ్రామంలో ప్లాట్లు కొన్న బాధితులు ఎదురుచూస్తున్నారు. న్యాయం కోసం కోర్టులు, అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయారు.

ఆది నుంచి వివాదాలే..

నిజాం పాలనలో ఐలాపూర్ గ్రామాన్ని ఆయన సర్ఫేఖాస్ (సొంత) గ్రామంగా రికార్డులు పేర్కొంటున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం సదరు భూములు జాగీర్దార్ల హయాంలో ఉండేవి. అనంతరం వారి వద్ద నుంచి వేరేవారు కొనుగోలు చేశారు. అప్పటికే సదరు భూమిని తరతరాలుగా సాగు చేసుకుంటున్న గ్రామ రైతులు యాజమాన్య హక్కు కోసం కోర్టులను ఆశ్రయించారు. కాగా, 1982లో భూములను సాగు చేసుకుంటున్న రైతులను భూ యజమానులుగా గుర్తిస్తూ సేత్వార్ జారీ చేశారు. దీనిపై తిరిగి జాగీర్దార్లు కోర్టుల్లో కేసులు వేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. 1983లో రాజగోపాల్‌నగర్, విద్యుత్‌సౌధ హౌజింగ్ కో ఆపరేటివ్ సొసైటీల పేర్లతో రెండు భారీ లేఅవుట్లు వేసి 3,600 ప్లాట్లను విక్రయించారు. అప్పట్లో పలువురు రియల్టర్లకు జాగీర్దార్లు దొడ్డిదారిన సేల్‌డీడ్‌లు చేసి భూములను విక్రయించారు.గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించడంతో అప్పటి నుంచి నలుగుతూనే ఉంది. వివాదాస్పద భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు ఏళ్ల తరబడి న్యాయపోరాటం చేస్తున్నారు. ఈక్రమంలో తమ భూములను కబ్జాల నుంచి కాపాడాలంటూ బాధితులు కొందరు హైడ్రా కమిషనర్‌ను కలిశారు. కోర్టు తీర్పు వచ్చేవరకు భూమికి రక్షణ కల్పించలని విజ్ఞప్తి చేశారు.

హైడ్రా కమిషనర్ రాకతో ఉద్రిక్తత

ఐలాపూర్ భూ వివాదం వల్ల నష్టపోయిన ప్లాట్ల యజమానులతో చర్చించేందుకు వచ్చిన హైడ్రా కమిషనర్‌కు ఊహించని పరిణామం ఎదురైంది. గ్రామస్థుల తరఫున కోర్టులో వాదిస్తున్న న్యాయవాది ఎంఏ ముఖీం హైడ్రా కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. విచారణ కోర్టు పరిధిలో ఉండగా హైడ్రా ఎలా ప్రవేశిస్తుందని ప్రశ్నించారు. మరోవైపు ఐలాపూర్ భూ వివాదానికి శాశ్వతంగా తెరదించాలని హైడ్రా క్షేత్రస్థాయిలో దర్యాప్తుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కోర్టుల్లో నలుగుతున్న వివాదాన్ని తెలుసుకుని ప్రభుత్వం తరఫున వివాదాన్ని పరిష్కరించి బాధితులకు న్యాయం చేసేందుకు న్యాయ నిపుణులతో సంప్రదిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఉండగా ఏళ్ల తరబడి భూములను సాగుచేసుకుంటున్న రైతులకు శాశ్వత న్యాయం చేయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. ఓవైపు ప్రభుత్వ భూములను పరిరక్షించుకుంటూనే.. ప్లాట్ల యజమానులకు, రైతులకు, అసైన్డ్ పట్టాలు ఉన్నవారి మధ్య ఎలాంటి వివాదం చోటుచేసుకోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

అధికారుల ఒత్తిడితో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య?
- సెల్‌ఫోన్‌లో కీలక విషయాలు
- అధికారులను విచారిస్తున్న పోలీసులు

7లో

రైస్‌మిల్లు సంపులో పడి అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

7లో

తైబజార్ వసూళ్లలో చేతివాటం
- టెండర్లు వేయడానికి ముందుకు రాని కాంట్రాక్టర్లు
- మున్సిపల్ ఆదాయానికి గండి
- సంగారెడ్డిలో దందా

7లో

సంగారెడ్డిలో మున్నాభాయ్‌లు

- అధికారుల తనిఖీల్లో నకిలీ వైద్యుల గుట్టురట్టు
- అర్హత లేకున్నా వైద్యం చేస్తున్న ముగ్గురు
- అల్లోపతి మందులు రాస్తున్న ఆయుర్వేదిక్ డాక్టర్
- అనుమతిలేని డయాగ్నోస్టిక్ సెంటర్ల గుర్తింపు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పలు క్లినిక్‌లు, ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లు, డయాగ్నోస్టిక్ కేంద్రాలను తెలంగాణ వైద్య మండలి అధికారులు ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ వైద్య మండలి వైస్ చైర్మన్ డా.జి.శ్రీనివాస్, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డా.వి.నరేశ్‌కుమార్, సభ్యుడు డా.కడాలి విష్ణుల బృందం ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మూడు క్లినిక్‌లు, ఓ డయాగ్నోస్టిక్ సెంటర్లను పరిశీలించారు. సంగారెడ్డి పట్టణంలోని అహ్మద్‌నగర్‌లోని ఫస్ట్‌ఎయిడ్ సెంటర్, పాత బస్టాండ్ సమీపంలోని మరో క్లినిక్, మండలం ఫసల్‌వాది పరిధిలోని ఓ క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఎన్‌ఎంసీ చట్టం, టీఎస్ ఎంపీఆర్, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాలకు విరుద్ధంగా, ప్రభుత్వ అనుమతి లేకుండా క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్టు గుర్తించారు. ఎటువంటి అర్హత లేకుండా అలోపతి వైద్యం చేస్తున్నారని, ఇష్టారీతిన యాంటీబయోటిక్స్, పెయిన్‌కిల్లర్స్, స్టెరాయిడ్ ఇంజెక్షన్లను రోగులకు ఇస్తున్నట్టు ఆధారాలు సేకరించారు. ముగ్గురు క్లినిక్ నిర్వాహకులపై ఎన్‌ఎంసీ, టీఎస్‌ఎంపీఆర్ చట్ట ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు టీజీఎంసీ వైస్ చైర్మన్ డా.జి.శ్రీనివాస్ తెలిపారు. ఇక ఫసల్‌వాదిలోని ఓ క్లినిక్‌లో డ్రగ్ కంట్రోల్ అథారిటీ అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో అల్లోపతి మందులు నిల్వ ఉంచారని దీనిపై జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు టీజీఎంసీ మెంబర్ డా.కడాలి విష్ణు తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలోని మరో క్లినిక్ వైద్యుడు అలోపతి వైద్యం చేయడం, యాంటీబయాటిక్, స్టెరాయిడ్ ఇంజెక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించి నోటీసులు ఇచ్చామని, ఆయుష్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అలాగే, ల్యాబ్‌టెక్నీషియన్ కోర్సు చదివి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ అనుమతి లేకుండా రాజంపేట శివాలయం రోడ్డులో నిర్వహిస్తున్న ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌పై చర్యలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, పారా మెడికల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేయనున్నామని పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డా.వి.నరేశ్ కుమార్ తెలిపారు.



సంగారెడ్డిలోని ఓ క్లినిక్‌లో తనిఖీలు చేస్తున్న వైద్య మండలి అధికారులు

లైబ్రరీ 12 గంటలు తెరిచి ఉంచాల్సిందే

సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్యయాదవ్

జోగిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ గ్రంథాలయాన్ని రోజుకు పన్నెండు గంటల పాటు తెరిచిఉంచాలని, లైబ్రేరియన్, సిబ్బంది విధుల్లో ఉండాల్సిందేనని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. జోగిపేటలోని శాఖా గ్రంథాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. లైబ్రేరియన్ సహా ఎవరూ విధుల్లో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులకు మెమో ఇవ్వాలని జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రెటరీని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ వెయ్యి జనాభా ఉన్న గ్రామాల్లో రీడింగ్ రూంలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవతో నారాయణఖేడ్, రాయికోడ్‌లో శాఖా గ్రంథాలయాలకు నూతన భవనాలను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఆయనవెంట నాయకులు కొశికె రాజు, కృష్ణ, అనిల్ తదితరులు ఉన్నారు.



జోగిపేటలో గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్యయాదవ్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికలకు సన్నద్ధం కండి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల విధులపై ఈ నెల 11న ఆర్‌వోలు, ఏఆర్‌వోలకు జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి డివిజన్లలోనూ 12, 13 తేదీల్లో పీవోలు, ఏపీవోలకు ఆయా మండల ప్రధాన కార్యాలయాల్లోనూ, 15న ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం శిక్షణనందించనున్నట్టు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మండల కేంద్రమైన జోగిపేటలో సోమవారం భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవనశైలిలో దైవ చింతన ఎంతో ప్రశాంతతను ఇస్తుందని పేర్కొన్నారు. అనంతరం మంత్రిని ఆలయ కమిటీ చైర్మన్ గూడెం మల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయనకు పూజారులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. అలాగే, పట్టణంలో ఇటీవల నూతనంగా విగ్రహ ప్రతిష్ఠాపన చేసిన సీతారామచంద్ర ఆలయాన్ని మంత్రి దర్శించుకున్నారు. మంత్రికి అర్చకులు చిదిరె కృష్ణమూర్తిశర్మ, రమణశర్మ ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ డేవిడ్, నాయకులు సురేందర్ గౌడ్, ప్రవీణ్, చిట్టిబాబు, డాకూరి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు చందు యాదవ్, లక్ష్మణ్, కుమార స్వామి, మహేశ్ యాదవ్, ఈర్ల శంకర్, నాయికోటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

గడ్డివాములు దగ్ధం

రాయపోల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లికి చెందిన నామసాని ఆంజనేయులు, నామసాని సదానందం వారి ఇంటి సమీపంలో పశువుల మేత కోసం రెండు గడ్డివాములను వేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు మంటలను అదుపులోకి తెచ్చారు. ఎవరో కావాలని గడ్డివాములకు నిప్పు పెట్టారని, రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి డబ్బులు డ్రా

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం గోవింద్ తండాకి చెందిన మేఘవత్ దశరథ్ గజ్వేల్ పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీ పల్లెపహడ్‌కు చెందిన తిరుపతి ఇంటికి వచ్చాడు. డబ్బులు అవసరం ఉండి తిరుపతికి చెందిన ఏటీఎం కార్డును దశరథ్ తీసుకుని గజ్వేల్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎంలో డ్రా చేసేందుకు వెళ్లి అక్కడే ఉన్న వ్యక్తిని డ్రా చేయమని అడిగాడు. డ్రా చేసిన తర్వాత అతడు కార్డును మార్చి ఇచ్చాడు. అనంతరం సదరు వ్యక్తి ఆ ఏటీఎం కార్డుతో రూ.16600 వేలు డ్రా చేశాడు. దీంతో బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రైం కార్నర్

రైస్‌మిల్లు సంపులో పడి అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



రైస్‌మిల్లు వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు



కృష్ణ(ఫైల్)

అల్లాదుర్గం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి) : రైస్‌మిల్లులో యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన అల్లాదుర్గం మండలం రాంపూర్‌లో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోండ కృష్ణ(28) రైస్‌మిల్లులో ఏర్పాటు చేసిన సంపులో పడి ఉండగా అక్కడున్న కొందరు వ్యక్తులు అతడిని వైద్యపరీక్షల కోసం తరలించేందుకు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ చేరుకునేలోపే కృష్ణ మృతి చెందాడు. అయితే, కృష్ణకు ఈత వస్తుందని అతడు సంపులో పడినా సురక్షితంగా బయటపడే అవకాశం ఉన్నప్పటికీ మృతిచెందడం అనుమానాలకు తావిస్తుందని గ్రామస్థులు సందేహం వ్యక్తం చేశారు. కృష్ణకు భార్య సావిత్రి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైస్‌మిల్లు వద్ద కృష్ణ భార్య, బంధువులు ఆందోళన నిర్వహించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు విచారణ చేపట్టారు.

మంజీరాలో దూకి ఒకరి ఆత్మహత్య



రమేశ్ మృతదేహం

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మంజీరా నదిలో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చిట్కుల్ గ్రామ శివారులోని చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు గ్రామానికి చెందిన గుడ్డనొల్ల రమేశ్(38) ఛాముండేశ్వరి ఆలయ సమీపంలోని మంజీరా నదిలో దూకగా, అదేగ్రామానికి చెందిన వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో వెతికించగా, ఫలితం లేకపోయే సరికి మెదక్ నుంచి గజఈతగాళ్లను రప్పించారు. రాత్రి వరకు రమేశ్ మృతదేహం లభించగా, పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని అతని ఆత్మ హత్యకు గల కారణాలు తెలియాల్సిఉందని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చెరువులో దూకి వృద్ధుడు..

చేగుంట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చేగుంట మండల పరిధిలోని కర్నాల్‌పల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొప్పులపల్లి బాలయ్య(79) ఆరేళ్లగా దగ్గుదమ్ముతో బాధపడుతూ ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎంతకూ నయం కాకపోవడంతో ఆదివారం పొలం వద్దకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని పెద్దచెరువు వద్ద చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించడంతో చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆసుపత్రికి తరలించి ఎస్ఐ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



అనిరుధ్ మృతదేహం

పాపన్నపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో బాలుడు మృతిచెందిన సంఘటన ఢాక్యా తండా గ్రామపంచాయతీ పరిదిలోని ధనూజతండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. పాపన్నపేట మండల పరిధిలోని నర్సింగ్‌రావుపల్లి తండాకు చెందిన కేతావత్ లక్ష్మణ్ పెద్ద కుమారుడు అనిరుద్(5) ఆదివారం లక్ష్మణ్ బావమరిది నిశ్చితార్థం నిమిత్తం ఇదే మండలం ధనుజాతండాకు వెళ్లారు. అనిరుధ్ స్పీకర్ బాక్సుల ఆటో వద్ద ఉన్న ఓ వైర్‌ను చూడకుండా కాలు పెట్టడంతో విద్యుదాఘాతానికి గురైకిందపడ్డాడు. కుటుంబీకులు గమనించి మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

అధికారుల ఒత్తిడితో మున్సిపల్ ఔట్‌సోర్స్ ఉద్యోగి ఆత్మహత్య?

- సెల్‌ఫోన్‌లో కీలక విషయాలు
- అధికారులను విచారిస్తున్న పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 10 : మెదక్ మున్సిపల్ అధికారుల వేధింపులతోనే ఔట్‌సోర్స్ ఉద్యోగి సంజీవ్ ఆత్మహత్య చేసుకున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పదేళ్ల నుంచి విధులు సంజీవ్‌ను మూడు నెలల క్రితం డంపింగ్‌యార్డులో విధులు నిర్వహించాలని మున్సిపల్ అధికారులు ఆదేశించారు. డిసెంబర్ 31న విధులకు వెళ్లిన అతను ఇంటికి రాకపోవడంతో జనవరి 1న డంపింగ్‌యార్డుకు వెళ్లి చూడగా ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. అతని సెల్‌ఫోన్‌లో దొరికిన వివరాలతో పోలీసులు చర్యలకు సిద్ధమయ్యారు. ముగ్గురు మున్సిపల్ శానిటేషన్ అధికారులను పోలీసులు సోమవారం సాయంత్రం విచారణకు తీసుకెళ్లి పంపించినట్లు తెలిసింది. బలవంతంగా డంపింగ్‌యార్డులో విధులపై తనను ముగ్గురు అధికారులు ఇబ్బంది పెడుతూ డబ్బు అడిగినట్లు ఆ వీడియోలో ఉందని కుటుంబసభ్యుల ద్వారా తెలిసింది.

తలో చేయి వేసి.. తళుక్కుమనిపించి

నాడు - నేడు



కళాశాల అందంగా, ఆహ్లాదంగా కనిపించాలంటే తలో చేయి వేయక తప్పదని గ్రహించారు కల్హేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు. అనుకున్నదే తడవుగా రూ.5 వేలు వేసుకుని కళాశాలకు పెయింటింగ్ వేయించి తళుక్కుమనిపించేలా చేశారు. కల్హేర్ జూనియర్ కళాశాల అధ్యాపకుల ఆలోచనను స్థానికులు అభినందిస్తున్నారు.

- కల్హేర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి)



తైబజార్ వసూళ్లలో చేతివాటం

- టెండర్లు వేయడానికి ముందుకు రాని కాంట్రాక్టర్లు
- సంగారెడ్డి మున్సిపల్ ఆదాయానికి గండి



సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని సంతలు, మార్కెట్లలో తైబజార్ వసూళ్లలో బల్దియా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పట్టణంలో వారానికి నాలుగు సంతలతో పాటు గంజిమైదాన్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో మార్కెట్లలో తైబజార్ కింద ఫీజులు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం తైబజార్ వసూళ్ల ప్రక్రియను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించాల్సి ఉంటుంది. సంగారెడ్డిలో మాత్రం అందుకు భిన్నంగా సాగుతున్నది. మున్సిపల్ అధికారులు టెండర్లు పిలిచినప్పటికీ, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో సిబ్బంది ద్వారానే వసూలు చేయిస్తున్నారు. సదరు సిబ్బంది తైబజార్ వసూళ్లలో అందినకాడికి దండుకుంటున్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

కరోనా కారణంగా 2021లో తైబజార్ వసూలు చేయలేదు. 2020 మార్చి నెలలో టెండర్లు పిలువగా, ఓ కాంట్రాక్టర్ రూ.23 లక్షలకు దక్కించుకున్నప్పటికీ, మునిసిపల్‌కు ఒక్క పైసా చెల్లించలేదు. 2022-23, 2023-24 సంవత్సరాలలో మరోసారి టెండర్లు పిలిచినప్పటికీ, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. 2024లో మూడోసారి టెండర్లు పిలవగా ఎవరూ ఆసక్తి చూపలేదు. మున్సిపల్ అధికారులు నిర్ధేశించిన లక్ష్యంగా భారీగా ఉండడంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దండుకుంటున్న సిబ్బంది

కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మున్సిపల్ సిబ్బంది, బిల్ కలెక్టర్ల ద్వారా వసూలు చేయిస్తున్నారు. ఇది సిబ్బందికి కల్పవృక్షంగా మారింది. ఫీజులు ఇష్టానుసారంగా వసూలు చేస్తూ, అందులో నుంచి అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పట్టణంలో ఆదివారం, సోమవారం, గురువారం, శుక్రవారం రోజుల్లో వారానికి నాలుగు రోజులు సంతలు జరుగుతున్నాయి. వీటితో పాటు గంజిమైదాన్, రైతుబజార్, పాత బస్టాండ్ వద్ద దుకాణ సముదాయాల్లోనూ తైబజార్ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఒక్క సంతలో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన నాలుగు సంతలు, దుకాణ సముదాయాల నుంచి నెలకు రూ.2 లక్షలకు పైగా మున్సిపల్ ఖజానాకు రావాల్సిన ఉన్నది. అయితే, సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తూ ఒక్కో సంతలో కేవలం రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ అధికారులు నిర్ధేశించిన ధరల కంటే అధికంగానే వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అయినా, ఖజానాకు చేరడం లేదు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తైబజార్‌లో జరుగుతున్న అక్రమాలపై పలువురు కౌన్సిల్ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

పొలాలకు దారి వదలండి.. లేదంటే భూములు తిరిగిచ్చేయండి

- కంపెనీ పనులను అడ్డుకున్న రైతులు



కంపెనీ నిర్మాణ స్థలిలో ఆందోళన చేస్తున్న రైతులు

తూప్రాన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లేందుకు దారి వదిలాలని, లేదంటే తాము కంపెనీకి ఇచ్చిన భూములను తిరిగిచ్చేయాలని తూప్రాన్ మండలం మజీద్‌పల్లి(ఎస్‌కే)లో రైతులు సోమవారం పరిశ్రమ నిర్మాణ పనులను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. మనోహరాబాద్ మండలం కొండాపూర్ శివారులోని అసైన్డ్ భూములను సేకరించి, టీజీఐఐసీ పరిశ్రమలకు కేటాయించింది. ముప్పిరెడ్డిపల్లి, కొండాపూర్ గ్రామాల పక్కనే ఉన్న తూప్రాన్ మండలం మజీద్‌పల్లి(ఎస్‌కే)లో ముప్పిరెడ్డిపల్లి గ్రామ రైతులకు వ్యవసాయ భూములున్నాయి. ఆ భూముల్లోకి వెళ్లేందుకు నక్షా దారి ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. భూసేకరణ చేపట్టిన రెవెన్యూ అధికారులు ఇష్టానురీతిగా సర్వేలు నిర్వహించి నక్షా దారి సైతం లేకుండా చేసినట్లు రైతులు ఆరోపించారు. ఓ పరిశ్రమ యజమానికి నక్షా దారి ఉన్న భూమి సైతం కేటాయించడంతో నిర్మాణ పనులు చేపట్టారు. దాంతో సోమవారం రైతులు అక్కడకు వెళ్లి ఆందోళన చేపట్టారు. పనులను అడ్డుకుని దారి వదలాలని కోరారు. తమకు టీజీఐఐసీ భూమిని కేటాయించి, చూపించిన నక్షా ప్రకారం నిర్మాణం చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పొలాల వద్దకు వెళ్లే రహదారిని లేకుండా చేస్తున్నారని, కంపెనీ నిర్మాణం చేస్తే తామెలా వెళ్లాలని మండిపడ్డారు. దారి వదలకుంటే కంపెనీలకు సేకరించిన భూములను తిరిగి ఇచ్చేయ్యాలని రైతులు డిమాండ్ చేశారు. సుమారు 40 ఎకరాల భూముల్లోకి దాది ఉండదని, టీజీఐఐసీ అధికారులు స్పందించి దారి చూపాలని రైతులు కోరారు.

విమాన భద్రతలో ట్రాఫిక్, మానవ తప్పిదాలే ముఖ్య సమస్యలు

- ఐఐటీ హైదరాబాద్ సాంకేతిక అధికారి డాక్టర్ ఎంవీ సత్యానంద్



మాట్లాడుతున్న సత్యానంద్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విమానయాన భద్రతలో పెరుగుతున్న ట్రాఫిక్, మానవ తప్పిదాలు ముఖ్య సమస్యలుగా నిలుస్తున్నాయని ఐఐటీ హైదరాబాద్ విశిష్ట సాంకేతిక అధికారి డాక్టర్ ముట్నూరి వెంకట సత్యానంద్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏరోస్పేస్ విభాగం ఆధ్వర్యంలో 'ఎయిర్ క్రాఫ్ట్ స్ట్రక్చరల్ సిస్టమ్ హెల్త్ మేనేజ్మెంట్, అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ' అనే అంశంపై సోమవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. తక్కువ, అధిక ఎత్తులో ఉన్న ఎయిర్ స్పేస్ ఆపరేషన్‌లకు సంబంధించిన డయాగ్నస్టిక్స్, ప్రోగ్నోస్టిక్స్ పద్ధతులపై విలువైన సమాచారాన్ని తెలిపారు. సవాళ్లను అధిగమించడానికి వినూత్న పరిష్కారాల అవసరాన్ని నొక్కి చెప్పారు. సమర్థవంతమైన ఎయిర్ ట్రాఫిక్ నిర్వహణ చాలా అవసరమని స్పష్టం చేశారు. విజయవాడలో ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదలు, డ్రోన్లు పోషించిన పాత్ర, వాటి విజయాలు, పరిమితులు, సాంకేతికతల ప్రభావంపై కేస్ స్టడీలను ఆయన విద్యార్థులతో పంచుకున్నారు. డేటా ఉన్నప్పుడు, కృత్రిమ మేధస్సు ఉంటుందని, సమాచార యుగంలో, మీరు ఏ డేటాను ఉత్పత్తి చేయబోతున్నారు అనే ప్రశ్నతో డాక్టర్ ముట్నూరి తన ఉపన్యాసాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ అక్తర్ ఖాన్, డాక్టర్ నికుల్ జాని, డాక్టర్ వి.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

మదూరు సొసైటీ కార్యాలయానికి తాళం వేసి సభ్యుల నిరసన



మదూర్ సొసైటీకి తాళం వేసి ఆందోళన చేస్తున్న రైతులు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మదూర్ సొసైటీ సీఈవో అవకతవకలపై విచారణకు సమయం మించిపోతున్నా అధికారులు రాకపోవడంతో ఆగ్రహించిన సభ్యులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సొసైటీలో 18 మంది సభ్యులు రుణమాఫీకి అర్హులైనప్పటికీ సీఈవో నిర్వాహకంతో వర్తించలేదన్నారు. 2016 నుంచి 2024 వరకు విడుతల వారీగా రుణాలు పొందగా, రుణమాఫీ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరుచలేదని మండిపడ్డారు. కొంత మంది పేరున ఫేక్ అకౌంట్‌తో సృష్టించి రుణాలు పొందినట్లు సీఈవో అవకతవకలకు పాల్పడినట్లు కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించరన్నారు. విచారణకు రావాల్సిన అధికారులు ఎందుకు రాలేదని బాధిత రైతులు మండిపడ్డారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేకమా.. పొడగింపా?

(5వ పేజీ తరువాయి)

గడువును పొడగిస్తుందా.. లేక స్పెషలాఫీసర్ల పాలనకే ఆసక్తి చూపుతుందా అనే నిర్ణయం ప్రభుత్వం చేతిలో ఉంది.

స్పెషలాఫీసర్ల నియామకానికి అధికారుల కసరత్తు

ప్రత్యేక పాలనకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. అయితే పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు ప్రభుత్వం ఇప్పటికే స్పెషలాఫీసర్లను నియమించిన సంగతి తెలిసిందే. సహకార సంఘాలకు సైతం అదేవిధంగా ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గుచూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల సహకారశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఎంపీడీవో, తహసీల్దార్ స్థాయి అధికారులను సొసైటీలకు ప్రత్యేకాధికారులుగా నియమించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఒక్కో సొసైటీకి ఒక్కో ప్రత్యేకాధికారిని నియమిస్తారా.. లేక రెండు, మూడు సొసైటీలకు నియమిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో సహకార సంఘాలు ఇలా..

మెదక్‌లో 53 సహకార సంఘాల పరిధిలో 76,765 మంది సభ్యులు ఉన్నారు. కొత్తగా 29 సొసైటీలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులు ప్రతిపాదించారు. సంగారెడ్డి జిల్లాలో 53 సంఘాలు ఉండగా వీటిలో 71,556 మంది సభ్యులు ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో 21 సంఘాల్లో 67,200 మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల పరిధిలో కొత్తగా సహకార సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తెప్పించుకుంది. కొత్తగా జిల్లాలు ఏర్పడి ఎనిమిదేళ్లవుతున్నా ఆయా జిల్లాలకు ప్రత్యేకంగా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాకు సంగారెడ్డి కేంద్రంగా ఉన్న డీసీసీబీనే కొనసాగిస్తున్నారు. కొత్త సంఘాలతో పాటు కొత్త బ్యాంకులు ఏర్పాటు చేస్తారా అనే విషయంపై స్పష్టత లేదు.

అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు కన్‌సాన్‌పల్లి విద్యార్థి



ఎగ్జిబిట్‌తో స్రవంతి, గైడ్ టీచర్ సిద్దేశ్

జోగిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో జపాన్‌లో జరగనున్న అంతర్జాతీయ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు జోగిపేట మండలం కన్‌సాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని స్రవంతి ఎగ్జిబిట్ ఎంపికైంది. స్రవంతి రూపొందించిన డెస్క్ లిఫ్టర్ ఎగ్జిబిట్ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించగా, అంతర్జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. త్వరలో జపాన్ దేశంలో నిర్వహించనున్న సకురా ప్రదర్శనలో ఎగ్జిబిట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి స్రవంతి, గైడ్ టీచర్ సిద్దేశ్‌ను కలెక్టర్ క్రాంతి వల్లూరు, డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిధారెడ్డి అభినందించారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నారాయణఖేడ్/హవేళిఘణపూర్/రామచంద్రాపురం/ ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ డివిజన్ పరిధిలోని మనూరు మండలం బోరంచ, ఖేడ్ మండలం పంచగామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఖేడ్ ఏఈవో నాగిరెడ్డి, ఏఈ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హవేళిఘణ మండలంలోని నాగాపూర్, హవేళిఘణపూర్ సబుస్టేషన్లలో విద్యుత్ లైన్లకు మరమ్మతు కారణంగా ఔరంగాబాద్‌తండా, స్కూల్‌తండా, చౌట్లపల్లి, హవేళిఘణపూర్, లింగ్సాన్‌పల్లి, నాగాపూర్, సుల్తాన్‌పూర్, తిమ్మాయిపల్లి బ్యాతోల్ గ్రామాల్లో ఉదయం 9 నుంచి 1 గంట వరకు కరెంట్ సరఫరా ఉండని ఏఈ వినోద్‌కుమార్, ఏడీఏ మోహన్‌బాబు తెలిపారు. తెల్లాపూర్ ఎంఐజీ సబ్ స్టేషన్ 33/11కేవీ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా హుడా కాలనీ పరిసర ప్రాంతాల్లో 10 నుంచి 11 గంటల వరకు, మైఫేర్ రోడ్డులోని జేపీ, ఇందిరానగర్, ఏటీ కాలనీ, తెల్లాపూర్, కేబీ కాలనీల్లో 11 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ శివశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

నర్సాపూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోర్పట్ల వద్ద ఉన్న మంజీర నీటి సరఫరా ఫిల్టర్ పంప్‌హౌస్ నుంచి నర్సాపూర్ ప్రాంతానికి వచ్చే ప్రధాన పైపులైన్ మరమ్మతులు ఉన్నందున 11న నియోజకవర్గంలో నీటి సరఫరా ఉండదని మిషన్ భగీరథ అధికారులు పేర్కొన్నారు. 12న నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ వాయిదా

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా 10న పిల్లలకు వేయాల్సిన అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం వాయిదా పడినట్టు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐవో) డా.శశాంక్ దేశ్‌పాండే తెలిపారు. జిల్లాలకు సరఫరా కావాల్సిన అల్బెండజోల్ మాత్రలు సరఫరా కాకపోవడం వల్లే కార్యక్రమాలన్ని వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

వాసవీ క్లబ్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో వాసవీ క్లబ్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా గవర్నర్ ఇరుకుల ప్రదీప్ సమక్ష్యంలో సంగారెడ్డి వాసవీ క్లబ్, వనిత క్లబ్, యూత్ క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు గంప శ్రీనివాస్ మాట్లాడారు.

విద్యార్థులకు పతకాలు

మెదక్: ఈనెల 9న హైదరాబాద్‌లో జరిగిన ఫోర్త్ ఇంటర్నేషనల్ ఆల్‌స్టైల్ మార్షల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు పలు పతకాలు సాధించారు. ఎంఈవో పుష్పవేణి మాట్లాడుతూ కటాస్ విభాగంలో రేణుక బంగారు, కావ్య, అనూష రజత, నందిని కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

వేలంలో రాచన్నస్వామి ఆలయ ఆదాయం రూ.15.45 లక్షలు

కోహీర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి ఆలయ పరిధిలోని మూడు దుకాణాలు, 10 ఎకరాల 36 గుంటల భూమి, టెంట్‌హౌస్‌లకు సోమవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివరాజ్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ సంవత్సరానికిగానూ రూ.15,45,300 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. ఈ వేలం పాటలో అత్యధికంగా మూడు దుకాణాలకు రూ.10.80 లక్షల ఆదాయం రాగా.. 10.36 ఎకరాల భూమికి రూ.1.65 లక్షలు, టెంట్‌హౌస్‌కు రూ.3.3 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

బోనస్ డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటా

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పాపన్నపేట/మెదక్/మెదక్ కల్చరల్/మెదక్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం బోనస్ డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో బిర్యానీ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. పాపన్నపేట మండల రైతులకు సంబంధించిన బోనస్ డబ్బులు రాలేదని తెలుసుకున్న ఎమ్మెల్యే అదనపు కలెక్టర్ నగేష్‌తో మాట్లాడారు. అరికెల గ్రామానికి చెందిన బాలమణికి రూ.50 వేల సీఎంఆర్ ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో పాపన్నపేటలో జరిగే హనుమాన్ ఆలయ పునఃప్రతిష్ఠకు రావాలని నాయకులు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు గోవింద్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమ్మవారి కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని సూరారంలో రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నీరజాపవన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ మండలం రాజుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మార్గం మల్లేశం, కొంతమంది బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే రోహిత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

రామాయంపేట పట్టణంలోని మల్లన్న జాతరకు భక్తులు పోటెత్తారు. సోమవారం ఎమ్మెల్యే రోహిత్‌రావు పాల్గొని ఆలయంలో పూజలు చేశారు.

మెదక్ పట్టణం నవాబుపేట శివారులోని మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం ఆలయంలో అఖండ దీపారాధన, గణపతి, గౌరీ పూజ స్వస్తిహీ పుణ్యహవాచనం చేశారు. స్వామివారి కల్యాణోత్సవంలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నాయకులు పవన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ కల్చరల్: కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

పూర్తి బాధ్యతతో విధులు నిర్వర్తించాలి: ఎస్పీ

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్లలో రైటర్లు పూర్తి బాధ్యతతో పనిచేసి కేసుల్లో జాప్యం లేకుండా చూడాలని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్టేషన్ రైటర్లకు సోమవారం శిక్షణా తరగతులు ప్రారంభించారు. స్టేషన్లలో రైటర్ల కొరత తీర్చడానికి జిల్లాలో కొత్తగా నియామకమైన పోలీసు కానిస్టేబుళ్లకు మూడురోజుల పాటు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది ప్రతిఒక్కరూ స్టేషన్ రికార్డుల గురించి తెలుసుకొని, పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి రికార్డు, హిస్టరీ షీట్స్ అప్‌డేట్ చేస్తూ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. నేరం జరిగినట్లు ఫిర్యాదు అందుకున్న వెంటనే క్రైమ్ సీన్‌కు చేరుకుని, నేర స్థలాన్ని ప్రొటెక్ట్ చేసి, నేరస్థల ఫొటోగ్రఫీ తీయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు సురేందర్‌రెడ్డి, సీఐలు రమేష్, కిరణ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమమే ధ్యేయంగా పోలీసుశాఖ కృషి చేస్తుందని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో కార్యాలయ సిబ్బంది పని ఒత్తిడి నుంచి సేద తీరడానికి కేఫ్‌టేరియా (క్యాంటీన్)ను సోమవారం ప్రారంభించారు. వివిధ పోలీస్‌స్టేష్ల నుంచి కార్యాలయానికి వచ్చిన సిబ్బంది సేద తీరడానికి అనకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ.సంజీవరావు, ఏవో ఇ.కళ్యాణి, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, డీటీసీ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆర్ఐలు పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

జాతరలు సంస్కృతికి ప్రతీకలు: ఎమ్మెల్యే



మల్లన్న జాతరలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జాతరలు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బచ్చుగూడెంలో నిర్వహించిన మల్లన్న జాతరలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఏడూ గ్రామాల్లో నిర్వహించే జాతరలు ఐకమత్యానికి చిహ్నాలన్నారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ ఎపీపీ శ్రీశైలంయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి



కర్నాల్‌పల్లిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మెదక్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : షిరిడీ సాయిబాబా కృపతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంట మండలం కర్నాల్‌పల్లి భక్తాంజనేయ షిరిడీ సాయిబాబా చతుర్దశ వార్షికోత్సవంలో స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బచ్చు రమేష్‌గుప్తా, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రాజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకే టాలెంట్ టెస్టులు

● డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్/వెల్దుర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సృజనాత్మకత వెలికితీసేందుకే టాలెంట్ టెస్టులు ఉపయోగపడుతాయని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఎఫ్‌పీఎస్‌టీ, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా జిల్లాస్థాయి భౌతిక రసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్ సోమవారం నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు మదన్‌గోపాల్, ప్రధాన కార్యదర్శి మురళీధర్, కోశాధికారి నరేందర్, జిల్లా కన్వీనర్ రమేశ్‌చారి, గైడ్ టీచర్లు పాల్గొన్నారు. అలాగే మెదక్‌లో జరిగిన జిల్లాస్థాయి భౌతికశాస్త్ర టాలెంట్ టెస్టులో వెల్దుర్తి పాఠశాల విద్యార్థి జెగ్గ శ్రీచరణ్‌గౌడ్ ప్రతిభ కనబరిచాడని ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య అన్నారు.



విజేతలతో డీఈవో వెంకటేశ్వర్లు

బీజేపీతోనే అభివృద్ధి: బీబీపాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీబీపాటిల్

మెదక్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎంపీ బీబీపాటిల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి తదితరులు పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో పట్టభద్రుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి దేశవ్యాప్తంగా ప్రజలు ఆదరిస్తున్న తీరు తమ గెలుపునకు సంకేతాలని వారు గుర్తుచేశారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, సుభాస్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం: హన్మంతరావు

మెదక్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని కాంగ్రెస్ రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా ఆయన భారీ సంఖ్యలో కార్యకర్తలతో కరీంనగర్ తరలివెళ్లారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ అరునార్తి వెంకటరమణ, ఉప్పల రాజేష్, రామాయంపేట కాంగ్రెస్ నాయకులు పల్లె రాంచంద్రాగౌడ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ నేతలతో మైనంపల్లి హన్మంతరావు

టీబీ ప్రోగ్రాంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

మెదక్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వందరోజుల టీబీ ప్రోగ్రాంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో శ్రీరామ్ అన్నారు. సోమవారం చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రిలోని సేవలపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రతీ డెలివరీ ప్రభుత్వ ఆస్పత్రిలో అయ్యేవిధంగా గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారన్నారు. ఆస్పత్రిలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం రోగుల నమోదు చేస్తున్న రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్, చేగుంట వైద్యాధికారి అనిల్‌కుమార్, సీహెచ్‌వో సంపత్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని డీఆర్‌వో పద్మజారాణి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో మైభారత్, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్, సర్దార్ పటేల్ యూత్ అసోసియేషన్ సంయుక్తంగా జిల్లాస్థాయి యువ ఖేల్ ఉత్సవ్ క్రీడలు సోమవారం నిర్వహించారు. ఈ క్రీడలను డీఆర్‌వో పద్మజారాణి వాలీబాల్ ఆడి ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో ఖాసీంబేగ్, పట్టణ సీఐ రమేశ్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ వైస్ చైర్మన్ హరికిషన్, కబడ్డీ సెక్రటరీ హన్మంత్‌గౌడ్, జిమ్నాస్టిక్స్ కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు.

బీసీ గణన తప్పుల తడక

● బీఆర్ఎస్ ముఖ్య నాయకులు

నర్సాపూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ గణన తప్పుల తడక అని, ఆ సర్వే లెక్కల వల్ల బీసీలకు అన్నివిధాల అన్యాయం జరిగే అవకాశం ఉన్నదని బీఆర్ఎస్ నర్సాపూర్ నియోజకవ నాయకులు విమర్శించారు. సోమవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వగృహంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు శేఖర్, రమణాగౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేలో బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపారని, దాంతో ఆర్థికంగా, ఉద్యోగపరంగా, రాజకీయంగా బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అందువల్ల తిరిగి సర్వే చేశాకే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్, యాదాగౌడ్, రింగుల ప్రసాద్, మాణిక్యం, రవి,సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కంది, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ పట్టణంలోని విశ్వానంద్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోర్ట్ ఆడిటోరియంలో ఈ నెల 6 నుంచి 10 వరకు అంతర్జాతీయ ఓపెన్ కరాటే పోటీలు నిర్వహించారు. ఇందులో కంది మండల పరిధి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో కేంద్రీయ పాఠశాలలో చదివే విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. కరాటే కోచ్ శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందిన కేంద్రీయ పాఠశాల విద్యార్థులు ఈ.రిత్విక్ గోల్డ్, బ్రౌన్ పతకాలు గెలుచుకోగా.. జే.భవ్య గోల్డ్ అండ్ సిల్వర్ మెడల్స్, పీ.స్పందన బ్రౌన్ మెడల్, టీ.ఆశ్మిత బ్రౌన్ మెడల్, జీ.విహాన్ బ్రౌన్ మెడల్, జే.నవ్య బ్రౌన్ మెడల్, ఎన్.క్రిష్ బ్రౌన్ మెడల్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరందరికి హీరో సుమన్ పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.



ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హీరో సుమన్

రాష్ట్రస్థాయి బాక్సింగ్‌కు విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సీనియర్ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2025కి సంగారెడ్డికి చెందిన బుష్రానాజ్, షగుప్తానాజ్ ఎంపికయ్యారు. 45-48 కేజీల కేటగిరీలో బుష్రానాజ్ ఎంపిక కాగా, 60-65 కేజీల కేటగిరీలో షగుప్తానాజ్ ఎంపికయ్యారు. హైదరాబాద్ లాలాపేటలోని జయశంకర్ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రత్యర్థులతో తలపడనున్నారు. వారిని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రసన్న, ప్రధాన కార్యదర్శి అంజలి, సంయుక్త కార్యదర్శి పృథ్వి, సభ్యులు సంజన అభినంధించారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు: కృష్ణ

వెల్దుర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని లిమ్‌పామ్ రిసోర్సెస్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ డీ.కృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్కపల్లి గ్రామంలో రైతు సత్యనారాయణగౌడ్ సాగుచేసిన ఆయిల్‌పామ్ పంటను పరిశీలించారు. ఆయన వెంట వెల్దుర్తి మండల ఫీల్డ్ అధికారి రకేష్ ఉన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు పది సూత్రాలు

● జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పరిరక్షణకు పది సూత్రాలు పాటించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి అన్నారు. సంగారెడ్డిలో ఏపీఎంలకు సోమవారం నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యాలను పరిరక్షించేందుకు ఆరోగ్యమే మహాభాగ్యం, ఆహారంలో ఆరోగ్యం, పోషకాలు నష్టపోకుండా వంట చేసే పద్ధతులు, పిల్లల పోషణ, రక్తహీనత తదితర అంశాలపై దృష్టిసారించి, పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి జంగారెడ్డి, బాలరాజ్, డీపీఎం రవిశేఖర్, జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి'

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని బీసీ ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలను చేసి తీర్మాణ పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీసీ నాయకుల మాణయ్య, మేదర మహేంద్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్రం, వీరశైవ లింగాయత్ లింగ బలిజ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల మాయంపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఐడీఏబొల్లారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలో సీలింగ్ భూముల వ్యవహారంపై అధికారులు విచారణకు ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన 'సీలింగ్ భూములకు మంగళం' అనే కథనానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ మాదురి స్పందించారు. 63 ఎకరాల సీలింగ్ భూములకు సంబంధించిన రికార్డులు పరిశీలనతో పాటు క్షేత్రస్థాయిలో ఏమి జరిగిందనే దానిపై పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆర్డీవో రవీందర్‌రెడ్డిని ఆదేశించారు. ఇందుకు సహకరించాలని తహసీల్దార్ బిక్షపతికి సూచనలు చేశారు.

సేవా దృక్పథంతో అభివృద్ధి పనులు

మెదక్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రయోజనాల దృష్ట్యా సేవాదృక్పథంతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి గ్రామంలో సుమారు రూ.3 కోటతో పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్‌సుభాష్, కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.



పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉజ్వల్‌రెడ్డి

సన్‌రైజ్ హాస్పిటల్ పదో వార్షికోత్సవం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని సన్‌రైజ్ హాస్పిటల్ పదో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం డా.స్వామిగౌడ్ మాట్లాడుతూ పదేళ్ల నుంచి అత్యాధునిక వైద్య పరికరాలతో తక్కువ ఖర్చుతో అనుభవం కలిగిన డాక్టర్ల చేత ప్రజలకు నాణ్యమైన వైద్యమందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.మల్లిక, సంతోష్‌గౌడ్, స్వాతి, రాములుగౌడ్, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో సన్‌రైజ్ హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది

విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

పెద్దశంకరంపేట/హవేళిఘణపూర్/గుమ్మడిదల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈవో వెంకటేశం అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధిరాములు, రాధిక, అశ్విని, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు. హవేళిఘణపూర్ మండలం సర్దన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జమీరొద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గుమ్మడిదలలోని ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు.

పంటలు పరిశీలించిన ఏడీఏ

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం కల్పగూర్‌లో రైతుల పంటలను ఏడీఏ వెంకటలక్ష్మి సోమవారం పరిశీలించారు. రైతులు పంటలకు రసాయన ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులను వాడితే పంటలు నష్టపోకుండా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఝాన్సీలక్ష్మీబాయి, ఏఈవో శ్రావణ్ పాల్గొన్నారు.



కల్పగూర్‌లో పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటలక్ష్మి

యువకుడి ఆత్మహత్య


మనోహరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకున్నది. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారు కొండాపూర్‌కు వెళ్లే దారిలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం, చంప జిల్లాకు చెందిన రాహుల్‌కుమార్(25) చెట్టుకు ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిది హత్యా..? ఆత్మహత్యా..? అనే కోణంలో విచారిస్తున్నారు.

కారు, బైక్ ఢీ.. ఇరువురికి గాయాలు

మెదక్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బైక్, కారు ఢీకొన్న ప్రమాదంలో ఇరువురు గాయపడ్డారు. మండల పరిధి అక్కన్నపేట శివారులో సోమవారం జరిగింది. మెదక్ వైపు నుంచి అక్కన్నపేటకు వస్తున్న బైక్‌ను కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో సలావుద్దీన్, అంజనేయులు గాయపడగా 108 సిబ్బంది చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మలుపల్లిలో వ్యక్తి అదృశ్యం

మెదక్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిన్నశంకరంపేట మండలం మలుపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన అరికెల సత్యనారాయణ వారంరోజుల క్రితం హైదరాద్‌లోని ఉప్పల్‌కు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కటుంబీకులు ఫోన్‌చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబీకులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9989165203 నంబరకు సమాచారమందించాలన్నారు.



సత్యనారాయణ (ఫైల్)

విద్యుదాఘాతంతో దుకాణం దగ్ధం

మెదక్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని సుభాస్ గంజ్ చౌరస్తాలోని ఎలక్ట్రికల్ సామాన్ల దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. ఈ ఘటనలో సామాన్లన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చినా దుకాణంలోని సామాన్లు కాలిపోయాయని బాధితులు తెలిపారు.